

స్వామివారి పూజలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

### చిల్పూరు వేంకటేశ్వరుడికి

## 108 బంగారు పద్మాలతో ప్రత్యేక పూజ

చిల్పూరు,డిసెంబర్ 12 : మండల కేంద్రంలోని శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అష్టాదశ పాద పద్మారాధన పూజను మంగళవారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారిని సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి తిరుపతిలో జరిగే విధంగా 108 బంగారు పుష్పాలతో అష్టాదశ పాద పద్మారాధన పూజను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో బీ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ప్రతి మంగళవారం అష్టాదశ పాద పద్మారాధన పూజా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ. 516లు చెల్లించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత దాత, దేవస్థానం మాజీ డైరెక్టర్ సంగోజు లక్ష్మీమోహన్, వెంకటేశ్వరపల్లె సర్పంచ్ తోకల దివాకర్ రెడ్డి, ఆయల డైరెక్టర్లు కుంచాల సంపత్‌రాజ్, రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, కృష్ణ, మహేశ్, మల్లికార్జున్, విశాల్, రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

దంతాలపల్లి, డిసెంబర్ 12: పేదలకు అందాల్సిన పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతుండగా దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై రమేశ్‌బాబు మంగళవారం తెలిపారు. గ్రామాల్లో తిరుగుతూ పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. మండలంలోని బొడ్లాడ వద్ద ట్రాలీ వాహనంలో తరలిస్తున్న 30క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసి చేశారు. అనంతపురానికి చెందిన పోతరాజు రమేశ్, మన్నెపుల శ్రీకాంత్, ఎరుకల రాములపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోలీస్ సిబ్బంది ప్రకాశ్‌రెడ్డి, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, గణేశ్ పాల్గొన్నారు.



పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో పోలీసులు

## తృటిలో తప్పిన పెను ప్రమాదం

దామెర, డిసెంబర్ 12: ఊరుగొండ సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వరంగల్-2 డిపోకు చెందిన ఆర్టీసీ హెయిర్‌విత్ బస్సు హనుమకొండ నుంచి ఏటూరు నాగారం ప్రయాణికులతో బయల్దేరింది. ఓగ్లాపూర్-ఊరుగొండ మార్గమధ్యలో పవర్ గ్రిడ్ దాటిన తర్వాత పెట్రోల్ బంక్ సమీపంలో ఒక్కసారిగా బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పత్తి చేనులోకి దూసుకెళ్లింది. ప్రభుత్వ టీచర్ ఆయేషా, కానిస్టేబుల్ శివకుమార్ తీవ్రంగా గాయపడ్డారు. మరో పదిమందికి స్వల్ప గాయాలు కాగా, వరంగల్‌కు తరలించారు. బస్సులో 33 మంది ఉన్నట్లు కండక్టర్ జవహర్‌లాల్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఆర్టీసీ డీఎం సురేశ్ సందర్శించారు.



పత్తి చేనులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

# జీడికల్ ఆలయంలో శ్రీరాముడి స్థూపం

- రామకోటి రచించే భక్తులకు అవకాశం
- భద్రాచలం వెళ్లలేకున్నా ఇక్కడే మొక్కులు చెల్లించే వెసులుబాటు

లింగాలఘనపురం, డిసెంబర్ 12 : మండలంలోని జీడికల్ వీరాచల సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీరాముడి స్థూపం భక్తులకు వరంలా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న జీడికల్‌లో భక్తులు రామకోటి సమర్పించుకునే అర్హత స్థూపం ఏర్పాటుతో లభించింది. వివరాల్లోకి వెళ్తే.. రామ భక్తులు తమ సమస్యలు తీరాలని కోరుతూ శ్రీ సీతారామచంద్ర స్వామికి ముడుపులు కడుతారు. రామకోటి రచించి ఆ గ్రంథాన్ని స్వామివారికి సమర్పించడం ఆనవాయితీ. ఈ అవకాశం ఇప్పటి వరకు భద్రాచలంలోనే ఉంది. శ్రీరాముడికి జీడికల్‌లో ముడుపులు కట్టినా మొక్కులు చెల్లించుకునేందుకు భద్రాచలం వరకూ వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లేవారు. ఇక్కడి ఆలయంలో రామకోటి గ్రంథాన్ని సమర్పించాలంటే శ్రీరాముడి స్థూపం తప్పని సరిగా ఉండాలనే ఆచారం ఉంది . ఈ క్రమంలో జీడికల్‌లో స్థూపాన్ని నిర్మించి, ఇటీవలె ఆవిష్కరించడంతో ఈ ప్రాంత భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రామకోటి రచనల గ్రంథాన్ని జీడికల్‌లో సమర్పించుకునే అవకాశం లభించిందని సంబురపడుతున్నారు.

**లక్ష మంది వరకూ సమర్పించవచ్చు..**
**–శేషుభారతి, ఆలయ ఈవో**

చాలా మంది భక్తులు రామకోటి రచిస్తామని జీడికల్ ఆలయంలో మొక్కులతో ముడుపులు కడుతుంటారు. అలాంటి భక్తులు ఇప్పటి వరకూ భద్రాచలం వెళ్లి అక్కడ గ్రంథాలను సమర్పించి మొక్కులు చెల్లించుకునేవారు. రామస్థూపం ఏర్పాటుతో ఆ సమస్య తీరింది. భక్తులు ఇక్కడే రామకోటి గ్రంథాన్ని సమర్పించుకోవచ్చు. లక్ష మంది లక్ష గ్రంథాలు రచించి సమర్పించుకునేందుకు ఇక్కడ అవకాశం కల్పించాం. ఇది భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.



జీడికల్‌లో నిర్మించిన శ్రీరాముడి స్థూపం



ఆలయంలోని హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

### ఆలయ హుండీ ఆదాయం రూ.2.33 లక్షలు

జీడికల్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ. 2,33,750 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో శేషుభారతి తెలిపారు. దేవాదాయ శాఖ భువనగిరి ఇన్‌స్పెక్టర్ సుమతి సమక్షంలో మంగళవారం హుండీలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో పూజారులు మరళీకృష్ణమాచార్యులు, భార్గవాచార్యులు, రఘువాచార్యులు, సిబ్బంది కేకే రాములు, భరత్‌కుమార్, మల్లేశ్ పాల్గొన్నారు.

## ఆర్‌ఎంపీకి దేహశుద్ధి

ఖానాపురం, డిసెంబర్ 12: మహిళకు అసభ్యకర మెసేజ్‌లు పంపిన ఓ ఆర్‌ఎంపీకి దేహశుద్ధి చేసిన మంగళవారం ధర్మారావుపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ ఓ మహిళకు కొద్దిరోజుల క్రితం అసభ్యకరమైన మేసేజ్‌లు పంపించాడు. విషయం తెలుసుకున్న మహిళ భర్త, కుటుంబ సభ్యులు గ్రామీణ వైద్యుడి ఇంటికి వెళ్లి చితకబాదారు. గ్రామస్తులు జో క్యంతో సద్దుమణిగింది. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మాధవ్ తెలిపాడు.

## రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్‌లో ఆదర్శ పాఠశాల విద్యార్థి ప్రతిభ

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 12: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో అనంతారం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాదావత్ ప్రత్యూష అనియర్ భార్ విభాగంలో పాల్గొని మూడు బంగారు పథకాలు సాధించింది. మంగళవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ అమరావతి, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. ఈనెల 15 నుంచి 22వ రకు ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు

బయ్యారం, డిసెంబర్ 12: కార్తీక మాసం చివరిరోజు సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుడు ఉదయ్ కుమారాచార్యులు అన్నాభిషేకం చేశారు. అనంతరం పలువురు దాతలు అన్నదానం చేశారు. మండలంలోని గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో అన్న ప్రసాద దాతలు తిరుమల సంజీవరెడ్డి-రమణమ్మ దంపతులు, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు మండా రవి, మోడెం సారయ్య, సమ్మెట ఉపేందర్, పులి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వారధి వచ్చే.. కష్టాలు తీర్చే..

- పీఎంజీఎస్‌వై నిధులు రూ.2.12కోట్లతో వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామాల ప్రజలు



వెన్నారం శివారులో గంగమ్మ గుడి వద్ద కల్వర్టుపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి



గతంలో లోలెవల్ బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

డోర్నకల్, డిసెంబర్ 12: వర్షాలు కురిసినప్పుడల్లా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఉయ్యాలవాడ, వెన్నారం, రాముతండా, తోడేళ్లగూడెం, ముల్కలపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. సమైక్య పాలనలో వెన్నారం ప్రజలు గంగమ్మ గుడి వద్ద లో లెవల్ కల్వర్టుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. వెన్నారం వాగుపై లోలెవల్ కల్వర్టు ఉండడం వల్ల వర్షాకాలం వచ్చిందంటే చాలు రెండు, మూడు రోజులదాకా రోడ్డు దాటనిచ్చేవి కాదు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు వారి దారి కష్టాలు తీర్చలేదు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి సమస్యలకు పరిష్కారం లభించింది. ఎన్నో ఏళ్ల ఆయా గ్రామాల ప్రజల కలను మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ సాకారం చేశారు. వెన్నారం శివారులో గంగమ్మ గుడి వద్ద లోలెవల్ కాల్వర్టుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి పీఎంజీఎస్‌వై నిధులు రూ.2.12 కోట్లు కేటాయించారు. 54.64 మీటర్ల పొడవు, 5 ఖానాలతో అధునాతన హంగులతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఇటీవల హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో దశాబ్దాల నాటి సమస్యకు మోక్షం లభించింది. ప్రజలు, వాహనాల రాకపోకలు సాఫీగా జరుగుతున్నాయి. హై లెవల్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

### దారి కష్టాలు తీరాయి



వానకాలం వచ్చిందంటే లోలెవల్ కాల్వర్టుపై వరద నీరు ఉధృతంగా ప్రవహించేది. దీంతో ప్రజలు, వాహనాలు రాకపోకలు రెండు, మూడు రోజులు నిలిచిపోయేవి. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బంది పడేవారు. ఎన్నో దశాబ్దాల సమస్య హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం. ఈ బ్రిడ్జి పూర్తి కావడం సంతోషంగా ఉంది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్‌కు కృతజ్ఞతలు.

–రెడ్డిమల్ల వెంకన్న, వెన్నారం